

### మహిళా డాక్టర్లు, సిబ్బందికి భద్రత కల్పించాలి

నైట్ డ్యూటీ చేసే మహిళా డాక్టర్లు, సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో సెక్యూరిటీతో భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. విద్యార్థినులు, మహిళల పట్ల సోదరభావంతో ప్రవర్తించే విధంగా తల్లిదండ్రులు మగ పిల్లలను తీర్చిదిద్దాలి. భవిష్యత్‌లో కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ జయంత్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొబ్బరితోట



### పటిష్ట చర్యలతోనే భద్రత

కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా ఆస్పత్రుల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణకు సుప్రీం కోర్టు చెప్పినట్లు సెంట్రల్ యాక్షన్ టీమ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి. కేవలం వైద్య రంగంలోనే కాకుండా మహిళలు పని చేసే అన్ని విభాగాల వద్ద ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల ప్రాంగణంలోనే పోలీస్ ఔట్‌పోస్టులు ఏర్పాటు చేస్తే రాత్రి విధుల్లో ఉన్న వారికి రక్షణగా ఉంటుంది.

– సీహెచ్ సుభాషిణి, స్టాఫ్‌నర్స్, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు



## క్లుప్తంగా

### ఆంజనేయస్వామిని దర్శించుకున్న వాసుపల్లి



స్వామికి పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ మంగళవారం పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో గల ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో 30వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు వద్దాది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

### పెన్షన్ బకాయిలు చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విదసం నాయకులు

మహారాణిపేట: గత నెలలో సామాజిక పెన్షన్లు తీసుకోలేని వారికి సెప్టెంబర్ నెల పెన్షన్‌తో కలిపి బకాయిలు చెల్లించాలని కోరుతూ మంగళవారం విదసం ప్రతినిధులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ గత నెల కొందరు వృద్ధులు, వికలాంగులు జూలై, ఆగస్టు మాసాల్లో పెన్షన్లు పొందలేకపోయారని, వారికి సెప్టెంబర్‌లో చెల్లించే పెన్షన్‌తో కలిపి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఈతలపాక సుజాత, బాజీ ఓంకార్, కస్తూరి వెంకటరావు, రవి సంతోష్, ములంపాక అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం సేవించి డ్రైవ్ చేసిన ఇద్దరికి జైలు శిక్ష

జగదాంబ: హార్బర్ స్టేషన్ పరిధి కాన్వెంట్ జంక్షన్ వద్ద మద్యం సేవించి డ్రైవ్ చేస్తున్న వారికి జైలుశిక్ష విధించినట్లు స్టేషన్ అధికారి పక్కి గణేష్‌బాబు తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు కాన్వెంట్ జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారిని కోర్టుకు హాజరు పరచగా ఇద్దరికి ఏడు రోజుల పాటు జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

### విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

జగదాంబ: కృష్ణాష్టమి సందర్భంగా స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ భగవాన్‌కు పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు కోలాటం ప్రదర్శించారు. సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మరింత ఉధృతంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం 1293వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రజా మద్దతు కూడగట్టి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేస్తామన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.5 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని మొరపెట్టుకుంటున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రజాధనంతో నిర్మించిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూడడం సబబుకాదన్నారు. వరసాల శ్రీనివాసరావు, మసేనురావు, కె.రాజబాబు, జి.జయ, తాండ్ర కనకరాజు, ఎ.శివరామకృష్ణ, తుమ్మల శ్రీనివాస్, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదం అంచున.. ప్రయాణం

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు ఎన్ని నిబంధనలు పెట్టినా ఫలితం ఉండటంలేదు. చాలా మంది నిబంధనలు పాటించటంలేదు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయటం.. జీబ్రాలైన్స్ క్రాసింగ్, రైట్‌సైడ్ ఓవర్‌టేక్ వంటి తప్పిదాలు చేస్తూ కోరి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను తమ ఆటోల్లో ఎక్కించుకుని ప్రమాదకర రీతిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. టిక్కెట్ సర్వీస్‌కు మొగ్గు చూపుతూ ప్రయాణికులు కూడా వారికి యథారీతి సహకరిస్తున్నారు.

- ఆటోల్లో లెక్కకు మించి ప్రయాణికుల తరలింపు
- నిబంధనలు గాలికి..
- తీరు మారని ఆటో వాలాలు





ఆటో వెనుక ప్రమాదకర రీతిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



కిక్కిరిసిన ఆటోలో చిన్నారులు



ప్రమాదకర పరిస్థితిలో ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్: జగదాంబ, పూర్ణామార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్, కేజీహెచ్, లేపాక్షి, కాన్వెంట్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆటో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ స్కూల్ పిల్లలు, కార్మికులు ఆటోల్లో ప్రయాణం సాగిస్తున్నారు. వీరితో పాటు ఇక్కడ వ్యాపారం, విద్య, ఉద్యోగం కోసం వేల సంఖ్యలో ప్రజలు వస్తూ పోతుంటారు. పని ముగించుకుని ఇంటికి వేగంగా వెళ్లాలన్న ఆలోచనతో ఆటో ప్రయాణం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఆటోవాలాలు ప్రయాణికుల అవసరాలను అనువుగా తీసుకుని క్యాష్ చేసుకుంటున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా..

ఆటోలో నిబంధనల ప్రకారం నలుగురు లేదా ఐదుగురు మాత్రమే ప్రయాణించాలి. అయితే ఇక్కడ ఆటోవాలాలు మాత్రం ఆరుగురి కన్నా ఎక్కువ మందిని ఎక్కించుకుంటున్నారు. డ్రైవర్ సీట్లో కూడా కూర్చోబెట్టుకుంటున్నారు. వెనుక సీటులో నలుగురైదుగురు.. ఆ వెనుక ముగ్గురు నలుగుర్ని కుక్కుతున్నారు. దీంతో పాటు ఆటోస్టాండ్‌లో వరుస క్రమంలో పెట్టాలనే ఆలోచనతో అతివేగంగా ఆటోలు నడుపుతున్నారు. ప్రయాణికులు కూడా గమ్యస్థానాలకు త్వరగా చేరాలన్న ఉద్దేశంతో ప్రమాదకరమైన ప్రయాణానికి సిద్ధమవుతున్నారు.

### పోలీసులు హెచ్చరించినా..

పరిమితంగా ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలు నడపాలని పోలీసులు నిత్యం ఆటో డ్రైవర్లకు సూచిస్తున్నారు. అయినా వారి తీరు మారడం లేదు. సిటీ పరిధి దాటిన తర్వాత ప్రయాణికులను ఎక్కించుకుని తమ పని తాము చేసుకుపోతున్నారు. ముఖ్యంగా నగర శివార్ల నుంచి ఆస్పత్రులు (కేజీహెచ్, కలెక్టర్ కార్యాలయ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రులు), మార్కెట్లకు వచ్చే వారు అధిక సంఖ్యలో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. టికెట్ సర్వీస్ కింద నగర శివార్ల నుంచి జగదాంబ, కలెక్టర్ కార్యాలయం, కేజీహెచ్‌తో పాటు వస్త్ర దుకాణాలు, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలకు పనుల నిమిత్తం వచ్చే వారు ఆటోలపై రావడం, తిరిగి టికెట్ సర్వీస్ కింద నగర శివార్లలో గల స్వగృహాలకు గుంపులు గుంపులుగా వెళ్తున్నారు.

### ఇది మరీ ప్రమాదకరం..

ఆటో వాలాలను అటుంచితే.. కొంత మంది ద్విచక్ర వాహన చోదకులు మరీ ప్రమాదకరంగా డ్రైవ్ చేస్తున్నారు. ఓ వైపు మంచినీటి ట్యాంక్.. మరోవైపు ముందు భాగాన ఓ చిన్నారి.. వెనుక భాగాన మరో బాలికను పెట్టుకుని ఓ ద్విచక్ర వాహన చోదకుడు ప్రమాదకర రీతిలో ప్రయాణిస్తూ 'సాక్షి' కంటపడ్డాడు.



ఆటోలో అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకున్న ఆటోవాలా

## ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి



విశేష పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా శ్రీలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### సిరులతల్లికి అష్టదళ పద్మారాధన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పరిష్కారమైన యూజీడీ సమస్య



నారాయణవీధిలో యూజీడీని దగ్గరుండి శుభ్రం చేయిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: యూజీడీ సమస్య 33వ వార్డు ప్రజలను వేధిస్తోంది. యూజీడీ లేక కొంత మంది బాధపడుతుంటే, ఉన్నచోట్ల నిర్వహణ సరిగ్గా లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూజీడీ నిండిపోవడంతో మురుగునీరు రోడ్డు పైకి వచ్చి గత వారం రోజులుగా అమ్మవారివీధి, నారాయణవీధి ప్రజలు అవస్థలు పడుతున్నారు. దుర్వాసనతో వీధిలో నడిచే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు జీవీఎంసీ యూజీడీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. దీంతో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము జీవీఎంసీ యూజీడీ సిబ్బందికి ఫోన్ చేయటమే కాకుండా అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో మంగళవారం యూజీడీని శుభ్రపరిచారని స్థానికులు తెలిపారు.

## మున్సిపల్ శాఖ మంత్రికి సమస్యల మొర



మంత్రి నారాయణకి ఉద్యోగుల సమస్యలు వివరిస్తున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు

డాబాగార్డెన్స్: విశాఖ విచ్చేసిన మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణను గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. ఆనందరావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలంటూ మొర పెట్టుకున్నారు. వుడా కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీలో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న ఎంటీఎస్, ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయమని కోరారు. మంత్రి స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జీవో 212కు ఎంత మంది అర్హత పొందుతారని అడగ్గా, సుమారు 800 మంది ఉంటారని ఆనందరావు తెలిపారు. అలాగే మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్, వాటర్ సప్లై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్‌స్కిల్డ్‌కు రూ.21 వేలు, సెమీ స్కిల్డ్‌కు రూ.24,500 జీవో 36 ప్రకారం చెల్లించాలని, గత 20 ఏళ్లుగా ఎంఏ అండ్ యూడీ డిపార్టుమెంట్‌లో పీహెచ్, నాన్ పీహెచ్ వర్కర్లకు ఒకే రకమైన జీతాలు ఉండేవని మంత్రికి వివరించారు. 9 మంది అధికారుల కమిటీ రిపోర్ట్ ఫైనాన్స్ డిపార్టుమెంట్ వద్ద పెండింగ్‌లో ఉందని తెలపగా మంత్రి స్పందిస్తూ సెప్టెంబర్ చివరి నాటికి కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లపై జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, రెండు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆనందరావు తెలిపారు.

## మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొణతాల శ్రీనివాస్ తదితరులు

డాబాగార్డెన్స్: మదర్ థెరిసా జయంతి మంగళవారం కొణతాల ఫౌండేషన్, గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో గల గాయత్రీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్ ముందుగా మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేతుల మీదుగా పేదలకు మందులు పంపిణీ చేశారు. అనంతరం కొణతాల మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా 2008 నుంచి వైద్య శిబిరాలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ చేస్తున్నామన్నారు. మదర్‌ను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యురాలు హరిత, ఎల్. స్వాతి, ఎస్. మంగ, బి. చంటి, కామేశ్వరరావు, భారతి తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న సామాజిక సేవకులు, ప్రతిభావంతులు

డాబాగార్డెన్స్: లీడర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మదర్ థెరిసా జయంతి కార్యక్రమంలో పలువురు సామాజిక సేవకులు, ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేశారు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. అర్జున, స్వర గీత కళాకారుడు భూపతిరావుకు జీవిత సాఫల్య పురస్కారాలు, కేవీఎస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోన శంకర్, జి. లక్ష్మణ్, తాడి నాగమణి సత్యం, కోడూరు రూప, వి. సత్యారావు, పల్లా సూరిబాబు, ముమ్మల తిరుపతిరావు, జె. దుర్గారావు, పచ్చిపులుసు కనకారావుకు సామాజిక పురస్కారాలు, సామాజిక ఫిలిం డైరెక్టర్ ఉంగరాల ఈశ్వరరావు, విజయలక్ష్మి, వరలక్ష్మికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వీరికి విశ్వమాత భారతరత్న మదర్ థెరిసా పురస్కారం, మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారి లూథర్‌బాబు, బ్యాంకు మేనేజర్ తేజ, ప్రముఖ న్యాయవాది కేపీ దేశాయ్, న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు, జంగం జోషి, కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చర్యలతో టీచర్లపై అదనపు భారం

**యూటీఎఫ్**



డిప్యూటీ డీఈవో సువర్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు బోధనేతర పనులను పూర్తిగా మినహాయించి.. కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం డిప్యూటీ డీఈవో సువర్ణకు జిల్లా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే సంతోషించామని, కానీ ప్రస్తుత చర్యలు మరింత భారం పెంచేలా ఉన్నాయన్నారు. ఎస్ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయకపోతే అందుకు హెచ్ఎంలు బాధ్యత వహించాలనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటల నుంచి మూడున్నరలోపు పది అంశాలతో కూడిన గూగుల్ ఫాం పూర్తి చేసి హెచ్ఎంలు అప్‌లోడ్ చేయాలని చెప్పడం అదనపు భారమన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్, నాయకులు కె.రాంబాబు, ఉప్పాడ రాము, రియాజ్ అహ్మద్, పెందుర్తి మండల అధ్యక్షుడు అప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

## మానవ మృగాలకు ఉరే సరి

గోపాలపట్నం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై ఘాతుకానికి పాల్పడిన మానవ మృగాలను ఉరి తీయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు, హెల్త్ వలంటీర్లు డిమాండ్ చేశారు. 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ–బ్లాక్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా విదసం ఐక్యవేదిక కో–కన్వీనర్ సోదదాసి సుధాకర్ మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణమని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దోషులు ఎంతటి వారైనా ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. రైల్వే యూనియన్ నాయకుడు డెంకాడ ఆనంద్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు. హెల్త్ వలంటీర్ అనూష మాట్లాడుతూ ప్రాణాలు నిలబెట్టే వారిపై మృగాల్లా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. ఇటువంటి చర్యలను ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బండారు తులసీరామ్, కె.సంజీవరావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## • మురుగుతో ముప్పతిప్పలు

కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తున్నది పూర్ణామార్కెట్ ఏరియాలో. దీంతో ఈ ప్రాంతంలో దుర్గంధం, దోమల స్వైరవిహారం అధికమయింది. ఈ మురుగు వల్ల పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.



ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## 2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి అప్పలకొండ యాదవ్

మహారాణిపేట: స్థానిక మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వ నమోదు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నియోజకవర్గం సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ఉప్పిలి అప్పలకొండ యాదవ్ ప్రసంగిస్తూ పార్టీని బలోపేతం చేయటానికి కార్యకర్తలు ముందుండాలన్నారు. సెప్టెంబర్ 2 నుంచి జరిగే సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అత్తిలి శంకరరావు, రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్, ఉపాధ్యక్షులు చొక్కాకుల రాంబాబు, తలాడ గిరిజ, రామ్‌కుమార్, పల్లా సాయి ప్రసాద్ రామ్మోహన్, దశమంతుల శ్రీను, దశమంతల సుశీల, మహాలక్ష్మి, జగదీష్ బాబు, మహిళామోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.